క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి



భోజనం రుచి చూస్తున్న తహసీల్దార్ నిత్యానందరాజు

కోసిగి: విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ నిత్యానందరాజు సూచించారు. మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ మెయినుద్దీన్‌తో కలిసి తనిఖీ చేసారు. భోజనం తిని రుచిని పరిశీలించారు. భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం రోజు వారిగా క్రమం తప్పకుండా భోజనం వడ్డించాలని సూచించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం బిల్లులు నెలలు గడిచినా అందలేదని వంట ఏజెన్సీలు వారి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పిల్లలకు అన్నం వడ్డిస్తున్నామని వాపోయారు. ఇందులో ఆ పాఠశాల హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆదోని రూరల్: మండలంలోని మేజర్ పంచాయతీ భరత్‌నగర్ కాలనీలో మంగళవారం శ్రీ వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. సోమవారం రాత్రి నుంచి స్వామివారి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజల అనంతరం హోమం చేపట్టారు. అనంతరం స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించి, విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



నూతన పైపులు వేసిన దృశ్యం

కౌతాళం: మండలంలోని కరణి గ్రామంలో పైప్ పగిలి పోవడంతో మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరించినట్లు సర్పంచ్ పుష్పలత, గ్రామ నాయకుడు గోవిందు తెలిపారు. 25సంవత్సరాల క్రితం వేసిన పైప్‌లైన్ పగిలి పోవడంతో మరమ్మతులు చేపట్టామన్నారు. అలాగే చూడి రస్తాలో రోడ్డుపై గుంతలు పడ్డ చోట గ్రావెల్‌ను వేసి చదును చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో గ్రామంలో నిరంతరంగా గ్రామ అభివృద్ధికి పాటు పడుతామన్నారు. ఇప్పటికే గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజి వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు.

2 నుంచి పార్లపల్లిలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో కార్తీక మాసం, శ్రీశ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం, రథోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి వివేకానందా యూత్ ఆధ్వర్యంలో డిసెంబర్ 2వ తేదీ నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు గిరి, దేవ, హరి, రాజు, కుమార్, రవికుమార్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వచ్చే నెల 1వ తేదీ లోపు తమ జట్టు పేర్లను రూ.600 ఫీజు చెల్లించి నమోదు చేయించుకోవాలని తెలిపారు. పోటీల్లో విజేతలకు వరుసగా రూ. 20,116, రూ. 15,016, రూ. 10,016 అందజేస్తామన్నారు. వివరాలకు 99481 40042, 98487 36649, 93903 27055 నంబర్లలో సంప్రదించాలన్నారు.

29న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఈనెల 29న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు మంగళవారం తెలిపారు. కౌన్సిల్ సభ్యులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

మంత్రాలయం: మండల కేంద్రంలో శ్రీ మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సుజయింద్ర ఆరోగ్యశాలలో పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీ మఠం అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని ఆర్.కె. కంటి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. గ్రామస్తులు, అధికారులు, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అన్నదాతను ఆదుకోని ప్రభుత్వం

- పెట్టుబడి సాయంపై చేతులెత్తేసిన కూటమి సర్కారు
- వరి దిగుబడులకు భారీగా తగ్గిన ధరలు
- గతేడాది క్వింటాల్ రూ.3,300, ప్రస్తుత ధర రూ.2,050
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని వైనం
- ధాన్యం నిల్వ చేసుకునేందుకు గోదాములు లేక అవస్థలు



వరిని సంచుల్లో నింపుతున్న కూలీలు



గోదాములులేక ఇంట్లోనే వరి దిగుబడిని నిల్వచేసుకొన్న దృశ్యం

ఎమ్మిగనూరు:కూటమి ప్రభుత్వంలో అన్నదాతకు కష్ట-నష్టాలు షరా మామూలయ్యాయి. పంట పెట్టుబడులకు రైతుభరోసా కింద ఏడాదికి రూ.20 వేలిస్తామన్న కూటమి సర్కార్ పెద్దలు చేతులెత్తేశారు. ఉచిత బీమాకు మంగళం పాడారు. పండిన పంటలకు గిట్టుబాటుధర అందేలా చూడాల్సినోళ్లు డైవర్స్ పాలి'ట్రిక్స్'లో బిజీగా మారారు. దీంతో రైతుకు నష్టాలు తప్పడంలేదు.

తగ్గిన దిగుబడి

ఎమ్మిగనూరు సబ్‌డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో వరి 3,000 హెక్టార్లలో సాగుచేశారు. తుంగభద్రనది తీరంలోని పంపుసెట్లు, ఎత్తిపోతల పథకాలతో పాటు ప్రధాన సాగునీటి వనరులైన ఎల్లెల్సీ, కేసీ కెనాల్, హెచ్‌ఎస్‌ఎస్ కాలువలు, గాజులదిన్నె ప్రాజెక్టు కింద సాగుచేసిన వరిపంట కోతలు మొదలయ్యాయి. ఎకరాకు 35నుంచి 40బస్తాల వరకు రైతులకు దిగుబడులొస్తున్నాయి. అదే గతేడాది 45 బస్తాల దాకా వచ్చింది. రబీ పంటగా కూడా వరిని సాగు చేసుకొనేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఒక్కో ఎకరాకు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు రైతులు వరిపంట సాగుకు పెట్టుబడులు పెట్టారు.

పడిపోయిన ధరలు

అందరికీ అన్నం అందించే వరి రైతు పరిస్థితి దయనీయంగా మారింది. గతేడాది రూ.3,900ల వరకు అమ్ముడుపోయిన వరి ధర ఈఏడు రూ.2వేలకు దిగజారింది. క్వింటాల్‌కు రూ.1000కిపైగా ధరలు పడిపోయి ధాన్యం రైతు గగ్గోలు పెడుతున్నా కూటమిపెద్దలు కనికరించడంలేదు. ప్రభుత్వ పర్యవేక్షణ కరువై వ్యాపారులు, మిల్లర్లు కుమ్మక్కై వరిపంట ధరలు అమాంతం తగ్గించేశారు.

పట్టించుకోని ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మార్కెట్‌లో ధరలు లేనప్పుడు రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధరకు దిగుబడులు కొనుగోలు చేసి రైతులను ఆదుకునేది. అయితే కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలను నిర్వీర్యం చేసే చర్యలు మొదలు పెట్టింది. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవడంలేదు. అలాగే కూటమి సర్కార్ రైతు భరోసా సాయంకు తిలోదకాలు ఇచ్చింది. పంట రుణాలు అందించే బ్యాంకర్లు మొండిచేయి చూపారు.

నిల్వచేసుకునేందుకూ ఇబ్బందే..

కొందరు రైతులు దిగుబడులను వెంటనే అమ్ముకోకుండా అధిక ధరలు వచ్చే వరకూ వేర్‌హౌజ్‌ల్లో నిల్వచేస్తున్నారు. గత ప్రభుత్వం రైతుల అవసరాన్ని గుర్తించి జిల్లాలో 95 వేర్‌హౌస్‌లను నిర్మించింది. అయితే ప్రస్తుత అవసరాలకు అవి సరిపోవడం లేదు. కూటమి ప్రభుత్వం కొత్త వేర్‌హౌస్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంలేదు. దీంతో ధాన్యం నిలువ చేసుకునేందుకు సౌకర్యంలేక రైతులు ఇళ్లలోనే నిల్వచేసుకుంటున్నారు.

క్వింటాల్ బియ్యం రూ.4500

వరిపంటకు గిట్టుబాటు ధరలులేక రైతులు ఇబ్బందులు పడుతుంటే మార్కెట్లో మాత్రం బియ్యం ధరలు తగ్గటంలేదు. క్వింటాల్ బియ్యం ధర రూ.4500 నుంచి రూ5000వరకు మిల్లర్లు అమ్ముతున్నారు. ప్రస్తుతం కర్నూలుసోనా బియ్యం క్వింటాల్ రూ.4,500కు అమ్ముడుపోతే. నంద్యాల సోనా,సన్న బియ్యం రూ.4,900వరకు విక్రయిస్తున్నారు.

గతేడాది రూ.3,000కు అమ్ముకున్నాం



ఈఏడాది రెండెకరాల్లో వరిపంటను సాగుచేశా. ఎకరాకు 40 బస్తాల చొప్పున రెండెకరాల్లో 80 బస్తాల దిగుబడి వచ్చింది. క్వింటాల్ ధర రూ.2300 చొప్పున అమ్ముకోవాల్సి వచ్చింది. గతేడాది క్వింటాల్ ధర రూ.3300చొప్పున అమ్ముకున్నాం. ఇటు దిగుబడులు తగ్గాయి. ధరలూ తగ్గాయి. ఎకరాకు రూ.15వేలకుపైగా నష్టపోవాల్సి వచ్చింది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– కురువ ఈరన్న, చిన్నకొత్తిలి

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



28 ఎకరాల్లో కర్నూలు సోనా పంటను సాగుచేశా. ఎకరాకు 40 బస్తాలకు పైబడి దిగుబడి వచ్చింది. మార్కెట్లో ధాన్యం అమ్ముకుందామంటే ధరలు పడిపోయాయి. క్వింటాల్ ధర రూ.2050కు అడుగుతున్నారు. ధరలు పెరుగుతాయనే ఆశతో కొంతకాలం పంటదిగుబడులను నిల్వచేసున్నా. ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి. అలాగే దిగుబడులను నిలువ చేసుకునేందుకు గోడౌన్ల నిర్మాణం చేపట్టాలి.

– అబ్బిరెడ్డి, నదికైరవాడి

విలేకరులపై అక్రమ కేసులు కూటమికే చెల్లు



మాట్లాడుతున్న చంద్రకాంత్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆదోని నియోజకవర్గంలో మునుపెన్నడూ లేనివిధంగా విలేకరులపై కేసులు పెట్టడం కూటమి నాయకులు, నాయకురాళ్లకే చెల్లుబాటు అయ్యిందని వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు ఫయాజ్ అహ్మద్, చలపతి, రహమాన్ అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నాడు వైఎస్సార్‌సీపీ పాలనపై విమర్శలు చేసిన నాయకులు, నాయకురాళ్లు నేడు భూకబ్జాలు, అక్రమ గ్రావెల్ వ్యాపార లావాదేవీలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిపై ఎన్నో ఆరోపణలు చేసిన నేతలే నేడు అక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు. వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చి వార్తలు రాసే విలేకరులపై కేసులు బనాయించడం బాధాకరమైన విషయమన్నారు. ఇలాంటి సంస్కృతి ఆదోని నియోజకవర్గంలో లేదన్నారు. ఇలాంటి విధానాలకు స్వస్థి పలకాలన్నారు.

కేసు కొట్టివేత

ఆదోని రూరల్: 2014లో జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మాధవకృష్ణారెడ్డి హత్య కేసును మంగళవారం ఆదోని మొదటి శ్రేణి జిల్లా కోర్టు కొట్టి వేసిందని న్యాయవాది మధుసూదన్ విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 2014లో ఆర్‌ఎస్ పెండేకల్ రైల్వేస్టేషన్ వద్ద మాధవకృష్ణారెడ్డి హత్య జరిగిందన్నారు. దీంతో 2014లో తుగ్గలి పోలీస్‌స్టేషన్‌లో 158/2014గా పోలీసులు 302, 201, 109 ఆర్/డబ్ల్యూ 34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారన్నారు. సుదీర్ఘ వాదోపవాదనలు విన్న తర్వాత కేసును కొట్టి వేస్తూ సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి పి.జె.సుధ తీర్పు వెలువరించారని చెప్పారు.

మహిళలు చైతన్యవంతులు కావాలి

కోసిగి: మహిళలు చైతన్యవంతులై అన్నీ రంగాల్లో రాణించాలని తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి పొదుపు మహిళలు, ఏపీఎం సత్యమ్మలతో కలిసి హింసకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. వారు మట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడు లు, బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. స్త్రీలకు విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యాక్రమంలో అంగన్ వాడీ సూపర్ వైజర్స్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మాసుమాన్‌దొడ్డి పాఠశాలలో మాక్ అసెంబ్లీ



మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మాసుమాన్‌దొడ్డి గ్రామంలోని ఎంపీపీ పాఠశాల అవరణలో మంగళవారం మాక్ అసెంబ్లీని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతిరాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు మాక్ అసెంబ్లీని నిర్వహించినట్లు చెప్పారు. అసెంబ్లీలో ప్రజాప్రతినిధులు కూర్చొని చర్చించే అంశాల గూరించి విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.

30న పింఛన్ల పంపిణీ

ఆదోని అర్బన్: వచ్చే నెల 1వ తేదీన ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే ఈనెల 30వ తేదీనే పింఛన్ల పంపిణీ చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ మంగళవారం తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులందరికీ ఈనెల 30వ తేదీన ఉదయం 6 గంటల నుంచే పింఛన్లను సచివాలయ సిబ్బంది అందజేస్తారన్నారు.

రైతుల జాబితా సరిచూసుకోండి

కౌతాళం: ఖరీఫ్ పంటకు సంబంధించి కరువు నివేదిక తయ్యారయ్యిందని మండల వ్యవసాయాధికారి శేషాద్రి తెలిపారు. నివేదికలను ప్రతి ఆర్బీకే సెంటర్ల వద్ద ప్రచురించడం జరిగిందని, నష్టపోయిన రైతులు వివరాలను సరి చూసుకోవాలన్నారు. ఏమైనా తప్పిదాలు ఉంటే సంబంధిత విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను కలిసి సరి చేసుకోవాలని సూచించారు. దీనికి ఈనెల 28సాయంత్రం వరకు సమయం ఉందన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

కౌతాళం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటిద్దామని అఖిల భారత రైతు కూలీ సంఘం మండల అధ్యక్షుడు నాగేంద్ర, మండల కార్యదర్శి జగదీష్ పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన కౌతాళంలో మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధనాలకు వత్తాసు పలుకుతూ పేదల జీవితాలతో అడుకుంటున్నదన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు సత్యన్న అన్నారు. మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు నిరసనగా పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు బాలరాజు, బాబు,ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి



గణేకల్ గ్రామంలో మాట్లాడుతున్న జడ్జి యజ్ఞ నారాయణ

ఆదోని రూరల్: ప్రజలు తమ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆదోని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి యజ్ఞ నారాయణ సూచించారు. మంగళవారం సాయంత్రం మండలంలోని గణేకల్ గ్రామంలో మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో కుటుంబ కలహాలు-వరకట్నం అనే అంశంపై అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ వరకట్నం తీసుకోవడం నేరమన్నారు. కుటుంబ సభ్యులు సమస్యలను పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతూ కాలయాపన చేసుకోవద్దని సూచించారు. అనంతరం భారత రాజ్యాంగ దినోత్సవం గురించి ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు లోకేష్‌కుమార్, నాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలపై క్షేత్ర స్థాయి విచారణ



భూ సమస్యలపై విచారిస్తున్న తహసీల్దార్ శివరాముడు

ఆదోని రూరల్: భూ సమస్యలను వేగవంతం పరిష్కరించాలని తహసీల్దార్ శివరాముడు ఆదేశించారు. మంగళవారం మండలంలోని బైచిగేరి గ్రామంలో రీ సర్వేలో తలెత్తిన సమస్యలపై గ్రామసభ ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. వీటిని క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేలో వచ్చిన చెక్ బందీలు, జాయింట్ ఎల్‌పీయం, విస్తీర్ణంలో పొరపాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి భూ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, మండల సర్వేయర్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ కేసుపై విచారణ



విచారిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

కౌతాళం: మండల పరిధిలోని కుంబళనూరు గ్రామానికి చెందిన 8 మందిపై సోమవారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు కావడంతో మంగళవారం ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు కౌతాళం సీఐ అశోక్ కుమార్‌తో కలిసి గ్రామంలో విచారణ చేపట్టారు. హరిజన ఈరన్నను కులం పేరుతో గ్రామానికి చెందిన 8మంది బీసీ కులస్తులు దూషించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం సీఐ కేసు నమోదు చేశారు. కేసు నమోదులో భాగంగా మంగళవారం సాయంత్రం గ్రామానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

ఎమ్మిగనూరుటౌన్: పారిశుద్ధ్య నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను మంగళవారం పరిశీలించారు. గాంధీ నగర్‌లో పారిశుద్ధ్య పనులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.



ఆదోనిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్యాలయ ఏఓ కె.వసుంధర



ఆదోనిలో అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు



కోసిగిలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న తహసీల్దార్ నిత్యా నందరాజు



కౌతాళంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దళిత సమాఖ్య నాయకులు

రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి

- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి

ఎమ్మిగనూరుటౌన్: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని వైఎస్సార్‌సీపీ వీరశైవ లింగాయత్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రుద్రగౌడ్, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అన్నారు. పట్టణంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాష్ట్ర శాప్‌నెట్‌వర్క్ మాజీ ఛైర్మన్ మాచాని వెంకటేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, పార్టీ శేణులతో కలిసి స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు నాగేషప్ప, శివప్రసాద్, డిష్‌కేశవరెడ్డి, సుధాకర్, సోమేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అలాగే వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అదేవిధంగా పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్నారు.

అంబేడ్కర్ ఆశయాలను సాధిద్దాం

ఆదోని టౌన్: అంబేడ్కర్ ఆశయాలను సాధిద్దామని వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్ చలపతి, ఫయాజ్‌అహ్మద్, నాయకులు సన్ని, రహమాన్, నాగరాజు, మల్లారెడ్డి, నాగన్న, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను కార్యాలయ పరిపాలన అధికారి కె.వసుంధర ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు జె.బాబు, రాఘవేంద్ర, వినీత్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీవైఎస్‌ఓ విష్ణు లక్ష్మీజీ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంజన్న, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి గోవిందరాజులు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సెయింట్ అంథోని పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కేశవయ్య, మిలన్ గ్రామర్ పాఠశాలలో కరస్పాండెంట్ రమేష్ బాబు, ఆదోని అర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ మురళీమోహన్ అధ్యాపకులు అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉప విద్యాధికారి వెంకటరమణారెడ్డి ఉపాధ్యాయులతో కలసి అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కోసిగి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంఈఓ మెయినుద్దీన్, హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పంచాయతీ కార్యాలయంలో ఈఓ తిరుమలేశ్వర రెడ్డి, కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసులు, కోసిగిలోని ఎమ్మార్పీఎస్ అనుబంధ కార్యాలయంలో నివాళుర్పించారు.



కౌతాళంలో మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మంత్రాలయం : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్‌కు జై భీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు చిక్కెంజానయ్య మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కౌతాళం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దళిత సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు కట్టా స్వామిదాస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ప్రతిభ హై స్కూల్‌లో విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు.

పెద్దకడబూరు :మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు సునీత ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళలర్పించారు.

గోనెగండ్ల: గాజులదిన్నె స్టేజీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ప్రజా సంఘాల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. గంజిహళ్లి పాఠశాలలో ఎంఈఓ రామాంజినేయులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



పెద్దకడబూరులో స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



మంత్రాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జై భీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు



పెసలదిన్నెలో ఉపాధి కూలీలకు రాజ్యాంగం గురించి వివరిస్తున్న సీఎల్ఆర్సీ కోర్సు డైరెక్టర్ సుజాత

ఎమ్మిగనూరురూరల్: బనవాసి జీవనోపాధుల శిక్షణా కేంద్రం కోర్సు డైరెక్టర్ సుజాత మండల పరిధిలోని పెసలదిన్నె గ్రామంలోని ఉపాధి కూలీలతో కలసి భారత రాజ్యాంగ దినోత్సవం వేడుకలను జరుపుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణి అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.



ఎమ్మిగనూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రుద్రగౌడ్, మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు



గోనెగండ్లలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



నందవరంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ పుల్లయ్య

నందవరం : భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించి, పరిరక్షించాలని ఎంపీడీఓ పుల్లయ్య, ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శివరామ్ ఆధ్వర్యంలో, అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.